# సహృదయం - సౌందర్యం

ఒక వారపత్రిక అట్టమీది చిత్రాన్ని తదేకంగా చూస్తూ, ఆ చిత్తరువులోనే లీనమైపోయినట్టుగా వుంది అరుణ.

"ఎంత సహజంగా చిత్రించాడు చిత్రకారుడు!" అంటూ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చకుండా వుండలేకపోయింది.

ప్రక్కనేవున్న స్నేహితురాండ్రు ఒక్కసారి ఫక్కున నవ్వేరు.

"నీకు నచ్చింది ఆ చిత్తరువా? లేక చిత్రకారుడా?" నవ్వుతూ అంది నీలవేణి.

అందరూ మళ్ళీ నవ్వేరు. అరుణ మొహం కోపంతో అరుణారుణమయ్యింది. ఉడుకుమోత్తనంతో మొహం చిట్లించుకుంది.

"చాల్లెండే! కళను కళాదృష్టితో చూడ్డం చేతనవుతే కదూ?" అంది.

వేదవతి చప్పున అందుకుంది, "ఔనే! నీలాటి కళాహృదయం మాకు భగవంతుడివ్వలేదు. ఏంచేస్తాం? అది మా దురదృష్టమే అనుకో! కాని, నీ యీ కళారాధన మాటల్లోనే

వుంచడం మంచిదికాదు. ఓ పనిచెయ్యి. నువ్వుకూడా కొన్నాళ్లు ఆ చిత్ర కారుని వద్ద శిష్యరికం చెయ్యి. నువ్వుకూడా ఓ చిత్రకారిణివిగా రూపొందుతావు..."

మళ్ళీ అందరూ నవ్వేరు.

అరుణకి వుడుకుమోత్తనం మరింత హెచ్చింది.

"అబ్బ! పోనిద్దురూ! ఏదో ఒక విషయం పట్టుకుని ప్రాణం తీస్తారు. నాకు నచ్చింది...మీకు నచ్చలేదు... అంతటితో ఆపరాదూ యీ గొడవ!" సీరియస్‌గా మొహంపెట్టి అంది.

అరుణ ఆ స్థితికి యెప్పుడైతే వచ్చిందో, అంతా గమ్మున వూరుకున్నారు. నవ్వులూ లేవు, కేరింతలూ లేవు. అసలు, వాళ్ళెప్పుడూ అంతే! ఏదో ప్రస్తావన తెచ్చి అరుణని యేడిపిస్తారు. ఆమెకి కాస్తంత కోపం వచ్చిందనగానే తగ్గిపోతారు.

"ఎందుకే అలా వుడుక్కుంటావు? సరదాగా యేదో అంటుంటాం..." అంది నీలవేణి.

అరుణ కోపం అకస్మాత్తుగా మాయమయ్యింది. చిన్నగా మందహాసం చేసింది.

"నిజంగా ఈ బొమ్మ బావుందే! పరిహాసం కాదుగానీ, చిత్రలేఖనమంటే పడిచచ్చే నువ్వు, ఓ చిత్రకారుణ్ణే పెళ్ళిచేసుకో కూడదూ?" మళ్ళీ అంది నీలవేణి.

"ఎవర్నో యెందుకు? ఈ చిత్రకారుణ్ణే చేసుకో!" పరిహాస ధోరణిలో అంది వేదవతి.

ఔనన్నట్టుగా నీలవేణికూడా అరుణ వేపు చూసింది. అరుణ మొహం దించుకుంది సిగ్గుతో.

"మనిషిని చూడకుండానా? అతను కోతిలా వుంటేనో?" అంతవరకూ మౌనంగావున్న వయ్యారిభామ, రమ చప్పునఅంది. ఆమెకు కావాల్సిన భర్త, నలకుబేరుణ్ణైనా సైతం ధిక్కరించేలా వుండాలి. అందమే ఆమె కాంక్షించేది...అది ఆమె మనసులోని భావం అనుకోండి.

"కోతిలా యెందుకుంటాడు? సంస్కార హీనంగా వుండకుండా వుంటే చాలుగా! చదువుకున్న వ్యక్తి సంస్కార హీనంగా వుండటం అసంభవం!" రమ అభిప్రాయాన్ని ఖండిస్తూ అంది అరుణ.

"చదువుకున్న వ్యక్తి అని యెట్లా చెప్పగలవు?" యెదురుప్రశ్న వేసింది రమ.

"అది లోకజ్ఞానం. భావగర్భితంగా చిత్రాలువేస్తున్న వ్యక్తి అక్షరశూన్యుడని యెవరూ వూహించలేరు. అవుతే, పెద్ద డిగ్రీలు లేకపోవచ్చు" మళ్ళీ జవాబిచ్చింది అరుణ.

అరుణ సమర్థన, రమకి అంతగా రుచించలేదు. అవుతే ఆమెకి జవాబు యివ్వడానికి పదాలు మరి కన్పించలేదు. అందుకే మౌనంగా వూరుకుంది.

"పోనిద్దురూ! ఈ విషయంలో వాగ్వివాదాలెందుకు! ఇంతకీ ఈ చిత్రకారుడు వివాహితుడేమో!" అంది వేదవతి.

"అలాగవుతే సమస్యేలేదు. అరుణమాత్రం పాపం భగ్నప్రేమికగా వుండిపోవాలిగామోసు!" నవ్వుతూ అంది నీలవేణి.

అరుణకి మళ్ళీ కోపం వచ్చింది. "చాలించండే యిక. దేనికైనా హద్దంటూ వుండాలి" అంది మూతిముడుచుకుంటూ.

అంతే! అక్కడితో ఆ టాపిక్ ముగిసింది. కాస్సేపు పోయాక యెవరిళ్ళకు వారు పోయారు.

అరుణ మాత్రం కుర్చీలో కూలబడి ఆలోచనల అంతరిక్షంలోకి తేలిపోయింది. ఆ చిత్రకారునిపట్ల అభిమానం యినుమడించింది. అతనిపై ఓ విధమైన అనురాగం ఉద్భవించింది. అతని ధ్యాసే ఆమెకు ధ్యేయమయ్యింది. అతని రూపురేఖలు వీక్షించాలనిపించింది. అతని వివరాలు తెలుసుకోవాలన్న ఆకాంక్ష పుట్టింది.

చప్పున లేచి టేబిలు దగ్గిరికిపోయి, లెటర్ పేడ్ తీసింది. ఆ చిత్రకారుని అడ్రసు తెలియజెయ్యమని, ఆ పత్రికా సంపాదకునకు ఉత్తరం రాసింది. తను తొందరపడుతోందేమోనన్న ఆందోళన ఓ ప్రక్కవున్నా, యేమిటో మరి—మనసు మార్చుకోలేకపోయింది. నౌకరుచేత ఉత్తరాన్ని పోస్టుచేయించింది.

ఆ రోజంతా అరుణ యేదో అవ్యక్తమైన ఆందోళనకు లోనవుతూనే వున్నది. తెలియని భయం ఆమెను వెన్నాడుతోంది.

"ఏంటమ్మా అదోలా ఉన్నావు?" అన్నాడు తండ్రి. రాత్రి భోజనాలదగ్గర.

అరుణ తృళ్ళిపడింది. తన మనోభావాలు మొహంలో ప్రతిఫలిస్తున్నా యేవిటి చెప్మా ? అన్న భయంతో కాస్తంత తికమకపడింది. అయినా నిభాయించుకుంది.

"అబ్బే! యేమీ లేదు నాన్నా" అనేసింది మెల్లగా.

ముకుందం, మరింకేమీ ప్రశ్నించకుండా లోలోన నవ్వుకున్నాడు. అతనికి కూతురంటే, అమితమైన అభిమానం. ఆమె మనసుకి కష్టం కలిగించడం, అతనికి చేతిగానిపని. అందుకే మళ్ళీ ప్రశ్న వెయ్యలేదు.

వారంరోజులు తిరక్కుండానే ఆ పత్రికవాళ్ళ దగ్గర్నించి ఉత్తరం వచ్చింది...ఆ చిత్రకారుని అడ్రసు తెలుసుకున్నందుకే మురిసిపోయింది. తీరిగ్గా కూచుని పట్టిపట్టి అక్షరాలురాస్తూ ఆ చిత్రకారునికి (పేరు సుందరం) వుత్తరం రాసింది. ఒక అభిమానిగానే వుత్తరం రాసింది. విశేషం యేమిటంటే, అతని పూర్తివివరాలు తెలుసుకోవాలన్న వుబలాటం ఆమెలో వుందని, ఆ ఉత్తరం చదివేవాళ్ళకు అర్థమౌతుంది. చివరికి ఫోటో పంపమని రాసేందుకూ-డా ఆమె జంకలేదు. తండ్రితో సంప్రదించకుండా, యీ విషయంలో పురోగమిస్తున్నందుకు ఆమె భయపడలేదు. తన యిష్టానికి వ్యతిరేకంగా తండ్రి యేనాడూ ప్రవర్తించడని ఆమె ధైర్యం. అయితే, తను ఉత్తరం రాసినట్టు స్నేహితురాండ్రకికూడా చెప్పలేదు.

* * *

రోజులు గడుస్తున్నాయి. అరుణకి ఆత్రుత అధిక మౌతోంది. ఆమె హృదయస్పందన క్షణక్షణానికి పుధృతమౌ తున్నట్టనిపిస్తోంది. ఓరోజు హఠాత్తుగా సుందరం దగ్గర్నించి ఉత్తరంవచ్చింది. ఉత్తరాన్ని ఉత్సాహంగా తీసుకుపోయి తన గదిలో తలుపువేసుకూర్చుని కవరు విప్పింది. ఆమె చేతులు వణికినయ్. ఉత్తరం పెద్దదేమీకాదు. పావురావుసైజు. మడత విప్పాక, అందులోని ఫోటో కళ్ళబడింది. ఆమె కళ్లు అప్రయత్నంగా మెరిశాయి. నిదానంగా చూసింది. ఫోటోలో మనిషి బాగానేవున్నాడు. పెద్ద అందగాడుకాదని నిశ్చయించుకుంది. ఉత్తరం చదివింది. అవివాహితుడని తేలాక, మరో పెద్దసమస్య నెత్తినపడినట్టు ఫీలయ్యింది. ఆమెలో నిరుత్సాహంలేదు. కాని, ఒక విధమైన భయం లీలగా ఆవరించింది. ఆ భయం యేమిటో ఆమెకే తెలీలేదు.

ఫోటోను మరోసారి తీక్షణంగా చూసింది. సర్వాంగ సుందరంగా చిత్రాలుగీచే చిత్రకారులూ, మృధుమధురంగా గానంచేసే గాయకులూ, సాధారణంగా అందంగా యెందుకు వుండరో, ఆమెకి అర్థంకాలేదు. అవుతే, మనసుకు హత్తుకునేలా చిత్రాలను గీయగల్గిన యీ సుందరం, సహృదయుడై వుండకండా పోడనుకుంది. అదే ఆమె తృప్తి. అదే ఆమె కోరేదికూడాను. ఉత్తరాన్ని మడిచి ఫోటోతోసహా తలదిండుక్రింద భద్రంగా దాచుకుంది.

ముకుందం, కూతురి పెళ్ళిచెయ్యాలన్న ప్రయత్నం ఆ సమయంలోనే ప్రారంభించాడు. అరుణ గాభరాపడింది, యేం

చెయ్యాలో తోచక. అయినా, అరమరిక లేకండా, తండ్రితో తన మనోభావాల్ని వ్యక్తపర్చింది. ముకుందం వున్నపాటున విస్తుపోయాడు. కూతురు అంత ధైర్యంగా ప్రవర్తిస్తుందని, అతను యెప్పుడూ అనుకోలేదు. కనీసం వూహించనైనా లేదు.

"అదేవిటమ్మాయ్ అలా అంటావు? అతణ్ణి నువ్వు చూళ్ళేదని అంటున్నావు. మనిషి యెలా వుంటాడో తెలీదు. వాళ్ళ కులం, గౌరవం, కుటుంబ సాంప్రదాయం యివేమీ తెలీవు. అటువంటప్పుడు అతణ్ణి వివాహం చేసుకోవడం యెలా సాధ్యపడుతుంది చెప్పు?" అన్నాడు కాస్త అయిష్టంగానే.

అరుణ మొహం దించేసుకుంది. తండ్రి మొహం చూడలేక పోయింది.

"మీరన్నది నేను కాదనలేను నాన్నా! అదేవిటో, అతని చిత్రాలు చూసిందగ్గర్నించీ, ఓ విధమైన బలహీనత నాలో ఆవిర్భవించి అసహాయురాలిగా చేసేసింది. ఎందుకోమరి, అతణ్ణి పెళ్ళి చేసుకుంటే, నా జీవితం సుఖంగా సాగిపోతుందని నా అంతరాత్మ ప్రబోధిస్తోంది. అలాగని మీకు వ్యతిరేకంగా పోవడం సాధ్యపడను...మీ యిష్టం" అంది మెల్లగా.

ముకుందం కూతురి మాటలకు బందీ అయ్యాడని చెప్ప వచ్చు. ఆమె చెప్పేరీతిలోనే ఆ శక్తి యిమిడివుంది. కూతురు తనమాటకి వ్యతిరేకంగా యెప్పుడూ చెప్పలేదు. ఇప్పుడూ తనకి వ్యతిరేకంగా పోవడంలేదు. అటువంటిది తను ఆ పసి

హృదయాన్ని గాయపర్చడమెందుకు? అనిపించింది ముకుందంకి. ఆమె సుఖమే తను కాంక్షించేది.

నిజానికి ముకుందం కూతురి వివాహ విషయంలో పెద్ద పథకం వేసుకునివున్నాడు. అసలు, అందుకే ఆమెను యింటరు వరకూ చదివించాడు. ఓ మంచి సంబంధం చూస్తున్నాడు కూడాను. ఇంతలోనే అరుణకు యీ బుద్ధిపుట్టడం అతని ఆశలకు సంకెళ్లు వేసినట్టయింది. అంతేకాదు. యేంచేయ్యాలో తోచక సతమత మయ్యాడు.

తండ్రి ఆలోచన గమనించి, అరుణకూడా కలవరపడింది. అంతలోనే ముకుందం మొహం పైకెత్తి ఆమెవేపు చూశాడు.

"చూడమ్మా! నీమాటకి నేనెప్పుడూ కాదనలేదు. కాని, నువ్వు నీ వివాహ విషయంలో నాకు తెలీకుండా యిటు వంటి నిర్ణయానికి రావడం యేమంత సమంజసంగాలేదు. నిజంగా నువ్వు అతణ్ణి వివాహం చేసుకోవాలనే నిశ్చయించు కున్నావా?"

అరుణ క్షణంసేపు జవాబివ్వలేకపోయింది.

"చెప్పమ్మా! నాదగ్గర నీకు భయమేఁవిటి?"

ముకుందం బ్రూన్పడిపోయినట్టయ్యాడు. అతనికి మరో మార్గం గోచరించలేదు. గట్టిగా ఓసారి నిట్టూర్చాడు.

"సరేనమ్మా! నీ మార్గానికి నేనెప్పుడూ అడ్డురాను. కాని, నేనుగా వెళ్లి వాళ్లతో సంప్రతించను. నువ్వే అతనిని

ఒప్పించి పెళ్ళి చూపులకు వచ్చేట్టు చూసుకో" అనేశాడు బరువుగా.

అరుణ ఆనందానికి అంతులేకపోయింది. తండ్రి అనుభవిస్తున్న బాధ అప్పట్లో ఆమెకు గుర్తురాలేదు.

"నువ్వు చాలా మంచివాడివి నాన్నా!" అంటూ వెళ్లిపోయింది తన గదిలోకి.

ముకుందం అదోలా నవ్వుకుని కుర్చీలో భారంగా కూలబడ్డాడు. తన ఆశలు కరిగిపోయాయన్న బాధ ఒక ప్రక్క, కూతురి మనోనిర్ణయం నెరవేరుస్తున్నానన్న సంతోషం మరో ప్రక్క, సమపాళ్ళలో అనుభవించాడు.

అరుణ ఆరోజే సుందరంకి వుత్తరం రాసింది. తన మనోనిర్ణయాన్ని తెలియజేస్తూ తన ఫోటోకూడా పంపింది.

నాలుగు రోజులు, నాలుగు యుగాల్లా గడిచాయి అరుణకి. అయిదోరోజు సుందరం దగ్గర్నుంచి ఉత్తరంవచ్చింది. ఆమె ఫోటో తనని ముగ్ధుణ్ణి చేసిందనీ, తను తప్పక వివాహం చేసుకుంటాననీ, తన తలిదండ్రులుకూడా సుముఖంగానే వున్నారనీ, రాశాడు. ఉత్తరం అంతా అయ్యాక, పరాలోమాత్రం 'మేం డబ్బున్నవాళ్ళం కాదు' అని రాశాడు.

అరుణకి, ఇంక కావల్సిన వివరాలంటూ యేమీ లేకపోయాయి. ఆమె కళ్లు వుత్సాహంతో మెరిశాయి. మనస్సు వుయ్యాలలూగింది. వెంటనే ఆ వుత్తరాన్ని తండ్రికి చూపించింది.

ముకుందం ఓ నిట్టూర్పు విడిచాడు. "సరేనమ్మా! వాళ్ళని ఓసారి రమ్మను" అన్నాడు.

అరుణ ఆ విషయాన్నే సుందరంకి రాసింది.

మరో నాలుగురోజులకు సుందరం దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. ఆ మరుసటిరోజే సుందరం, వాళ్ళ అమ్మా నాన్న గారుకూడా వచ్చారు. సుందరాన్ని తలుపు చాటునుండి చూసింది అరుణ. ఫోటోలో వున్నట్టుగానే కనిపించాడు. ఛాయ ఫరవాలేదనిపించింది. అయినా అందం చూసి తను వివాహం చేసుకోబోవడంలేదుగా! అని సమర్థించుకుంది.

సుందరం తలిదండ్రులు అరుణని చూసివచ్చారు. తమ కోడలు అంతలక్షణంగా వున్నందుకు మురిసిపోయారు. సుందరం ఆనందం చెప్ప శక్యంకాదు.

కొద్దిరోజుల్లో వివాహం జరిగింది. అరుణ స్నేహితురాండ్రు ఆమె పట్టుదలకి విస్తుపోయారు. పెళ్ళికొడుకు అందచందాలు వాళ్ళకి నిరుత్సాహం కలిగించింది. ఆడంబరమేమీ లేకుండా సింపిల్‌గా వున్నాడు సుందరం. అరుణకు తగ్గ భర్త కాడని స్నేహితురాండ్రు గుసగుసలాడు కున్నారు. అలాగని అరుణ మొహంమీద చెప్పలేరుగా.

"ఎలాగవుతేనేం—అతడినే వివాహం చేసుకున్న నీ పట్టుదలకు హర్షించాలి" అంది వేదవతి. "ప్రఖ్యాత చిత్రకారుని భార్య వయ్యావన్నమాట!" అంది నీలవేణి.

ఇలా చెరోమాట అంటున్నారు. "ఆ స్తి పా స్తు లు లేకుండా యెంత కళానైపుణ్యాంవుంటే ప్రయోజనం యేమిటి?" అంది ఓ ధనికుల ఆడపడుచు...ఈ విషయంలోనే ఆమెకోసం వచ్చిన యెన్నో సంబంధాలు తప్పిపోయాయి.

"మాకువున్న ఆస్తి చాలదేమిటి? మా నాన్నకు నేను తప్పించి యింకెవరున్నారు?" అంది అరుణ నవ్వుతూ.

అంతవరకు మౌనం వహించివున్న రమ, యింక వూరుకోలేక పోయింది.

"నువ్వే చెప్పూ అరుణా, నీకుతగ్గ భర్తకాదు...కాకి ముక్కుకు దొండపండులా వున్నావు నువ్వు" అంది అయిష్టంగా.

అరుణ మనస్సు చివుక్కు మంది. అయినా, రమలాంటి వ్యక్తినోట ఆ మాట రావడంలో ఆశ్చర్యమేమీ లేదనుకుంది.

"నాకు అలా అనిపించలేదు రమా! వ్యక్తిగా ఆయన నాకు ఎంతగానో నచ్చారు" అంటూ జవాబిచ్చింది నవ్వుతూనే.

రమకి ఛెళ్ళున లెంపకాయ కొట్టినట్టుగా వినిపించినయ్ ఆ మాటలు. అదోలా ఆమెవేపు చూచి ప్రక్కకి మొహం తిప్పుకుంది.

తర్వాత ఎవరికితోచిన బహుమతులు వాళ్ళిస్తున్నారు. ఏవేవో ఛలోక్తులు విసురుతూ వెళ్ళిపోయారు. సుందరం మాత్రం మధ్యహాలులో యెవరో పెద్దలతో మాట్లాడు తున్నాడు యివేమీ పట్టించుకోకుండా.

స్నేహితురాండ్రు అందరూ వెళ్ళిపోయాక అరుణ చిన్నగా నవ్వుకుంటూ మంచమ్మీద కూర్చుండి పోయింది.

*  *  *

కాలచక్రం నిర్విరామంగా తిరుగుతోంది. అరుణ అత్తవారింట్లో హాయిగా కాలం గడుపుతోంది. భార్యాభర్తలు అన్యోన్యంగా మెలుగుతూ సంసారాన్ని స్వర్గసీమగా రూపొందించుకుంటున్నారు.

పండక్కి- అమ్మగారింటికి వచ్చింది అరుణ. సుందరం కూడా వచ్చాడు. వారం దినాలుండి అతను వెళ్ళిపోయాడు మళ్ళా వస్తానంటూ. అరుణ వచ్చిందని తెలిసి వేదవతి వచ్చింది.

స్నేహితురాల్ని యెంతో ఆప్యాయంగా ఆహ్వానించి ఆదరించింది అరుణ. ఇద్దరూ చాలసేపు అవీ యివీ మాట్లాడుకున్నారు.

"రమకి వివాహమయ్యిందే!" అంది మాటలమధ్య వేదవతి.

"అహ; అలాగా! మరి, నాకు తెలియజెయ్యలేదేం ?" విస్తుపోతూ అంది అరుణ.

"అసలు, యెవ్వరికీ తెలీదు. అకస్మాత్తుగా సంబంధం కుదిరిందట. అదీ, వాళ్లు తీర్థయాత్రలకు వెళ్లినపుడా అబ్బాయితో పరిచయ మయ్యిందట."

"అవుతే, ప్రేమపెళ్లే నన్నమాట" అంది మందహాసంతో అరుణ.

"అన్నమాటే! దూరపు బంధుత్వంకూడా వుందని అంటారు మరి. అది యెంత వరకు నిజమో తెలీదు."

"పెళ్ళి యెక్కడ జరిగింది?"

"ఇంక వ్యవధి యెందుకని గామోసు, తిరుపతి కొండ మీద శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలోనే జరిపించేశారు."

"బావుంది...బావుంది. అవుతే, అబ్బాయి అందంగా వుండి వుండాలి తార్కిక దృష్ట్యా! లేకపోతే రమ ప్రేమించి వుండదు."

"ఔను. అందంగానే వుంటాడు... అదీ నేను ఒకే ఒక్కసారి చూశాన్లే...ఓ సారి వెళ్దామా? ప్రస్తుతం యిక్కడే వుంది."

"రేపు వెళ్దామవుతే"

మరుసటిరోజు యిద్దరూ రమ యింటికి బైలుదేరారు. రమ, వాళ్ళని ఆదరంతో ఆహ్వానించింది. "ఎప్పుడొచ్చావు అరుణా?" అంది.

"వచ్చి పదిరోజులై వుంటుందిలే. ఔనుగాని, యెవరికీ తెలీకండా పెళ్ళాడేశావేమిటే?" నవ్వుతూ అంది అరుణ.

రమ మొహం సిగ్గుతో వాలిపోయింది. "వేదవతి చెప్పే వుంటుందికదే! అప్పట్లో అలా జరిగిపోయింది."

"మీ ఆయన ఫోటో అయినా చూడనీ పోనీ!" అంది అరుణ.

రమ ఫోటో తెచ్చి చూపించింది. ఫోటోలో అతను యెంతో బావున్నాడు. తప్పకుండా అందగాళ్ళ లెక్కలోకివస్తాడు.

"నీ అభిరుచికి తగ్గట్టు, అందగాడే దొరికాడులే! అదృష్టవంతురాలివే!" అంది నవ్వుతూ అరుణ.

రమ మొహం అప్రయత్నంగా మ్లానమయ్యింది. అరుణ, వేదవతి అది గమనించి విస్తుపోయారు.

"ఏం అదృష్టంలెద్దూ!" అంది రమ తేలిగ్గా నవ్వుతూ.

యేదో చెప్పబోయి, దాస్తున్నట్టు యిద్దరూ గ్రహించుకున్నారు.

"అలా అంటావేమిటే! అందమైన భర్త లభించడంకూడా ఓ అదృష్టమేగా?" అంది వేదవతి.

రమ గట్టిగా నిట్టూర్చింది.

"అని నేనూ అనుకుండేదాన్ని మొదట్లో! కాని, స్వానుభవం వల్ల తెలుసుకుంటున్నా... వ్యక్తికి కావల్సిందీ, వుండవల్సిందీ ఆత్మసౌందర్యమేగాని బాహ్య సౌందర్యం కాదని" అంది భారంగా.

రమనోట అటువంటి మాటలు వినడం వారికిదే ప్రథమం. ఆమె సంసారిక జీవితంలో యేవో ఒడుదుడుకులు వుంటున్నాయని వూహించుకుందుకు వారికి యెక్కువకాలం పట్టలేదు. "అదేమిటే

అలా అంటున్నావు? బాహ్య సౌందర్యం వున్నవారికి, ఆత్మ సౌందర్యం—అదే మంచిమనసు వుండదనా నీ అభిప్రాయం?" అంది అరుణ.

"అలా అని నేను ఖచ్చితంగా చెప్పలేనుగాని, మావారి విషయంలో అది అక్షరాలా నిజమని తేలిపోయింది!" మరీ బరువుగా చెప్పింది రమ.

"ఇంతకీ, జరిగిందేమిటి?" ఆసక్తితో అడిగింది వేదవతి.

"సరదాగా యేం తిరిగామో, పెళ్ళయిన కొత్తలోనే. తర్వాత ఆయన మారిపోయారు. కాదు...అది అతని స్వభావ మేమోననిపిస్తుంది. ఎప్పుడూ చిరుబురుమంటుంటారు. ఏరోజు కూడా రాత్రి పన్నెండు గంటల ముందు యింటికిరారు. ఏం చెప్పుకోవడం? వీటన్నింటికీ సహనంతో తట్టుకుంటున్నాను. కాదు...బండబారిపోయాను. మొండిగా జీవితాన్ని సాగిస్తున్నా! కొన్నాళ్ళ పాటయినా సుఖంగా వుండాలని యిక్కడికి వచ్చేశాను" అంది నిట్టూరుస్తూ.

కాస్సేపు యెవరూ మాట్లాడలేదు.

"నువ్వు యిక్కడికి రావడంలోనే పొరపాటు చేశావు రమా! భార్య భర్తకి దూరంగా వుండి సుఖంగా జీవితం సాగించలేదు. సాగించకూడదు కూడాను. అతనికి అను గుణ్యంగా తిరుగుతూ, అతణ్ణి మార్చే ప్రయత్నం చేయ్యడమే, మన ధర్మం...మన విధి. అంతేగాని, యిలా నిస్పృహ చెంది

జీవితాన్ని మరింత నరక యాతనగా చేసుకోకూడదు. నేనిలా అంటున్నానని మరోవిధంగా అనుకోకు." అంది అరుణ.

రమ అదోలా నవ్వింది. ఆ నవ్వులో జీవం లేనట్టే అనిపించింది.

"అనుకోవడానికి యేముందిలేగాని, నీకు జ్ఞాపకముందా మీ ఆయనగురించి నేను ఆరోజు అన్నమాటలు? ఇప్పుడవి తల్చుకుంటే, నాకే సిగ్గువేస్తుంది. ముక్కూ మొహం తెలియని వాణ్ణి, పరిచయం లేకుండానే ఆత్మశుద్ధితో, అందాన్ని ఆకాంక్షించకండా పెళ్ళిచేసుకుని సుఖంగా వున్నావునువ్వు... పరిచయమయ్యాక ప్రేమించి పెళ్లి చేసుకున్న వ్యక్తితో అందాన్ని కాంక్షించిన నేను సుఖజీవనం సాగించలేక పోతున్నాను. విధి చాలా విచిత్రమైనది అరుణా! ఏం చేస్తాం!" అంది రమ. ఆమె కళ్ళల్లో నీరు దోబూచు లాడుతున్నట్టు గమనించింది అరుణ. రమపై ఆమెకు జాలిగలిగింది.

"అబ్బే! అలా నువ్వు బాధపడకు రమా! మీ ఆయన్ని మార్చుకోగలిగే శక్తి నీలోనే వున్నది. అది యెప్పటికైనా సాధిస్తావనే నమ్మకం నాకుంది. అధైర్యపడకు. మీ ఆయన దగ్గరికి వెళ్ళిపోవడానికే ప్రయత్నించు" అంది సలహాయిస్తూ.

రమ యింకేమీ మాట్లాడలేదు. "కూర్చోండి... యిప్పుడే వస్తా" అంటూ లోపలికివెళ్ళి కాఫీ తెచ్చియిచ్చింది.

*　　　　*　　　　*

రమ వాళ్ళని గేటు వరకూ సాగనంపి లోపలికివచ్చి నిట్టూరుస్తూ బరువుగా కుర్చీలో కూలబడిపోయింది.

అరుణ, వేదవతి, నడుస్తున్నారు... "రమలో బాగా మార్పువచ్చింది అరుణా?' అంది వేదవతి.

"ఔనుసుమా! అప్పట్లో వుండే వుత్సాహం, గర్వం, ఆమెలో యిప్పుడు కరువయ్యాయి. దాంపత్య జీవితం అనుకూలంగా లేకపోతే మనసు బావుండదు మరి. అయినా, అందాన్నే దృష్టిలో పెట్టుకుంటూ, యెదుటివారి మనసుని అర్థం చేసుకుందుకు గానీ, తన మనసు వారికి అనుగుణ్యాంగా మార్చుకుందుకుగానీ ప్రయత్నించకపోతే, యిటువంటి అనర్థాలే వస్తాయి" అంది అరుణ.

"అందరూ ఒక్కలాంటివారు వుంటారా చెప్పు! వివిధ మనస్తత్వాలు యెప్పుడూ వుండనేవున్నాయి. వస్తామరి! మళ్ళీ కలుసుకుందాం" అంటూ తన యింటివేపు తిరిగింది వేదవతి.

అరుణ ఒంటరిగా నడుస్తున్నది యింటికేసి. రమ విషయం అప్రయత్నంగా మెదడులో మెదిలింది. రమకంటే తనే ఆనందంగా వుంది...అనుకుంటూ మురిసిపోయింది ఆ క్షణంలో.